

# సోంపేట తర్వాతనైనా... ఈ విధ్వంసకర అభివృద్ధి గురించి ఆలోచిద్దామా?

అభివృద్ధి మాటలో ఎంత అబద్ధం ఉందో సోంపేట లోకానికి తేటతెల్లం చేసింది. అయినా అదే అబద్ధం కాకరాపల్లి నుండి కనపర్తి వరకు, పోలవరం నుండి పోలాటితిప్ప వరకు, సింగరేణి ఓపెన్‌కాస్టుల నుండి నెల్లూరు వరకు నిస్సిగ్గుగా మళ్లీ మళ్లీ చెపుతూనే ఉన్నారు.

అందరికీ తెలుసు, ప్రభుత్వానికీ తెలుసు. తాగడానికి నీరు, పండించుకోవడానికి భూమి ఇస్తానన్నందుకు కాదు సోంపేట రణస్థలమైంది. పిల్లలకు చదువులు, జనానికి వైద్యం ఏర్పాటు చేస్తానన్నందుకు కాదు ఉద్దానం ఉద్యమ క్షేత్రం అయింది. మత్స్యకారులకు వలలు, పడవలు కొనిపెడతామన్నందుకు కాదు రామయ్యపట్నం పోరుదారి పట్టింది. వాళ్లకు అవన్నీ లేకుండా చేస్తున్నందుకు. ఉన్న వాటిని కూడా తీసేసి ఆ ప్రక్రియకు అభివృద్ధి అనే పేరు పెడుతున్నందుకు. ఏ ప్రాంతానికైనా అభివృద్ధి అంటే అక్కడ ప్రజల జీవనప్రమాణాలు పెరగడం. కాని పాలకుల దృష్టిలో అభివృద్ధి వేరు. దానికి ఊళ్ళు ఖాళీ కావాలి. మనుషులు వలసపోవాలి. రెండు లక్షల మంది బతికేచోట ఒకే ఒక పెద్ద పొగగొట్టం స్మారక స్థూపంలా నిలబడాలి.

ఇవాళ సోంపేటలో ఎవర్ని అడిగినా చెపుతారు వాళ్ల 'బీల' భూమికి పర్యావరణ ప్రాముఖ్యం ఎంతో ఉందని. వీటిని పరిరక్షించాల్సిన ఆవశ్యకత గురించి ప్రపంచమంతా ఆలోచిస్తుండగా మన ప్రభుత్వం మాత్రం ఇంత విలువైన భూమిని ఎందుకూ కొరగానిదిగా పేర్కొని ఎన్.సి.సి పవర్ ప్లాంట్ కోసం అన్ని మంత్రిత్వ శాఖల్నీ ఏకం చేసి అనుమతులు సంపాదించిపెట్టింది. రెవెన్యూ శాఖ, పర్యావరణ మండలి, అటవీ శాఖ, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ, జిల్లా యంత్రాంగం సమస్తమూ ఈ వక్రీకరణలో భాగస్వాములే. ఇక పోలీసుల తీరు మీడియాలో చూడనే చూశాం. జులై 14న పలాసపురానికి చెందిన గున్న జోగారావునూ, లక్కవరానికి చెందిన గోనాపు కృష్ణమూర్తినీ కాల్చి చంపారు. స్థానిక ప్రజలపై బీభత్సం సృష్టించారు.

ఈ దుర్ఘటన జరిగిన మర్నాడే నేషనల్ ఎన్విరాన్‌మెంట్ అపెలేట్ అథారిటీ (ఎన్.ఇ.ఎ.ఎ.) ఎన్.సి.సి పవర్ ప్లాంట్‌కి పర్యావరణ అనుమతులను రద్దు చేస్తూ ఆశావహమైన తీర్పునిచ్చింది. ఇంత జరిగిన తర్వాత ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై గౌరవమున్న ప్రభుత్వమైతే ఏం చేయాలి? ఎన్.సి.సి.కి కట్టబెట్టిన బీల భూమినంతా వెనక్కి తీసుకోవాలి. దాని ఏర్పాటుకిచ్చిన అనుమతులన్నీ రద్దుచేయాలి. అవకతవకలకు పాల్పడిన అధికారులను శిక్షించేందుకు చర్యలు తీసుకోవాలి. దానికి బదులుగా మన రాష్ట్ర ముఖ్యమంత్రిగారు పవర్ ప్లాంట్‌కు అనుమతులు రద్దు చేస్తే అభివృద్ధి కుంటుపడిపోతుందనీ, అలా జరక్కుండా చూడాలనీ కోరుతూ కేంద్ర పర్యావరణ మంత్రికి నిర్లజ్జగా ఒక లేఖ రాశారు. అనుమతుల పునరుద్ధరణకై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి గాను మంత్రుల ఉప కమిటీ ఒకటి ఏర్పాటు చేసి వారిని ఢిల్లీకి కూడా పంపించారు.

సంతబొమ్మాళి మండలంలో కూడా ఇదే కథ. అక్కడ తంపర భూముల విస్తీర్ణం నాలుగువేల ఎకరాలని అంచనా. వాస్తవాలను వక్రీకరించి ప్రభుత్వం ఈ విలువైన ప్రాంతాన్ని ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్‌కు కట్టబెట్టడంతో ప్రస్తుతం 2640 మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ పవర్ ప్లాంటు పనులు అక్కడ చకచకా జరిగిపోతూ ఉన్నాయి.

ఇటువంటి వినాశకరమైన అభివృద్ధిని ప్రోత్సహించడానికి పాలకులు ఎంతకైనా తెగిస్తారనేది  అనేక సందర్భాలలో మనకు అర్థమవుతూనే ఉంది. కృష్ణాజిల్లా పోలాటితిప్పలో పర్యావరణ రీత్యా అతి సున్నితమైన సి.ఆర్.జడ్-I (తీరప్రాంత క్రమబద్ధీకరణ మండలి-I)లో బొగ్గు ఆధారిత థర్మల్ ప్లాంట్‌కు పెద్ద ఎత్తున భూమిని అప్పగించేస్తారు. ఉత్తర తెలంగాణ జిల్లాలలో ఊళ్ళకు ఊళ్ళను ఖాళీ చేయించి, వ్యవసాయాన్నీ, కులవృత్తులనూ నాశనం  చేసి ఓపెన్‌కాస్ట్‌ల ద్వారా బొగ్గును తవ్వి తీస్తారు. విజయనగరం జిల్లా కొమరాడ మండలంలో రిజర్వాయర్ ఆయకట్టులోనే ఓ ప్రయివేట్ కంపెనీకి థర్మల్ ప్లాంట్ కోసం భూమిని అప్పగిస్తారు. దాని నిర్వహణకు నాగావళి నుంచి 2.5 టి.ఎం.సిల నీటిని బరితెగించి కేటాయించేస్తారు.

పైపెచ్చు స్థానికులు ఈ ప్రాజెక్టుల వల్ల జీవనోపాధి కోల్పోతుండగా ఇవన్నీ వలసలు నివారించడానికేనని అబద్ధాలు ఆడడం నేర్చారు. పచ్చని సీమను బూడిదపాలు చేసే పరిశ్రమలను నెలకొల్పాలనుకోవడం ఎంత వికృతమైన ఆలోచన? పైగా ఈ పరిశ్రమలన్నిటినీ కాలుష్యరహిత పరిశ్రమలుగా బూటకపు చిత్రణ. ఇటువంటి అన్యాయాన్ని సహజంగానే ప్రజలు నిరసిస్తారు. సోంపేట ప్రాంత ప్రజలు ఈ విషయంలో అగ్రభాగాన నిలబడ్డారు. వారి పోరాటంలో విధ్వంసకర అభివృద్ధి నమూనాను వ్యతిరేకించే ఆకాంక్ష ఉంది. పర్యావరణంపై అపారమైన గౌరవం ఉంది. జిల్లా అభివృద్ధికి ఏది అవసరమో, ఏది ప్రాధాన్యమో చెప్పగలిగే ఆత్మవిశ్వాసం ఉంది. అమెరికా జీవనసరళిని అనుకరించేందుకు వనరులను వృధాచేసే మనవాళ్ళ బుద్ధిహీనతను ప్రశ్నించే విచక్షణ ఉంది. మనకు అనుగుణమైన జీవనసరళిని అలవరచుకోమనే సందేశం ఉంది.

సోంపేట ప్రాంత ప్రజలు ఈ విషయంలో అగ్రభాగాన నిలబడ్డారు. వారి పోరాటంలో విధ్వంసకర అభివృద్ధి నమూనాను వ్యతిరేకించే ఆకాంక్ష ఉంది. పర్యావరణంపై అపారమైన గౌరవం ఉంది. జిల్లా అభివృద్ధికి ఏది అవసరమో, ఏది ప్రాధాన్యమో చెప్పగలిగే ఆత్మవిశ్వాసం ఉంది. అమెరికా జీవనసరళిని అనుకరించేందుకు వనరులను వృధాచేసే మనవాళ్ళ బుద్ధిహీనతను ప్రశ్నించే విచక్షణ ఉంది. మనకు అనుగుణమైన జీవనసరళిని అలవరచుకోమనే సందేశం ఉంది.

ఇప్పుడు ఈ 'అభివృద్ధి' ఆలోచన ఎంత దూరం పోయిందంటే ఒక్క నెల్లూరు జిల్లా తీర ప్రాంతంలో కేవలం 20 కి.మీ పరిధిలోనే 12500 మె.వా. సామర్థ్యం గల 8 థర్మల్ విద్యుత్ కేంద్రాలు రాబోతున్నాయి. తూర్పుగోదావరి జిల్లా తాళ్ళరేవు మండలంలో రిలయన్స్ వారి సహజవాయువు ప్రాజెక్టు వల్ల దాదాపు 12000 మత్స్యకార కుటుంబాలు ఇప్పటికే రోడ్డున పడ్డాయి. ఈ సంస్థ అక్కడ 217 ఎకరాల మడ అడవులను తన ప్రాజెక్టు కోసం తొలగించేసింది. స్థానిక ప్రజలు ఉపాధి పొందే చిన్న చెరువులూ, రొయ్యల చెరువులూ దీంతో మాయమైపోయాయి. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలో కనపర్తి వద్ద 4000 మెగావాట్ల థర్మల్ ప్లాంట్‌ను నెలకొల్పడానికిగాను భూసేకరణ నోటీసులు జారీ చేశారు. కనపర్తి ఎత్తిపోతల పథకం కింద రైతులు సాగుచేసుకుంటున్న ఐదువేల ఎకరాల్లో సుమారు మూడు వేల ఎకరాలను ఈ ప్లాంట్ కోసం సేకరించాలనేది ప్రభుత్వ ఆలోచన. మా పచ్చటి నేలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో అంటున్నారు.

## కోస్టల్ కారిడార్

ఇచ్ఛాపురం నుండి నెల్లూరు జిల్లా తడ వరకూ గల 972 కి.మీ సముద్ర తీరాన్ని ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పెట్రోలియం, పెట్రో కెమికల్స్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌గా (పి.సి.పి.ఐ.ఆర్) ప్రకటించింది. ఇది దేశంలోని తీరం పొడవునా 8112 కి.మీ పరిధిలో తలపెట్టిన ఇండియన్ కోస్టల్ కారిడార్‌లో భాగమని చెబుతున్నారు. మన రాష్ట్రంలో తీరం వెంబడి ఉన్న ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, ఇతర ప్రాజెక్టులన్నీ కూడా ఈ కారిడార్‌లో భాగమే. ఇందులో దాదాపు 76 విద్యుదుత్పత్తి కేంద్రాలూ, ఏడు ఓడరేవులూ, ఆరు హెలీపాడ్లూ, మూడు విమానాశ్రయాలు రానున్నాయని భోగట్టా. ఎన్ని ఫార్మా కంపెనీలు, చమురుశుద్ధి కర్మాగారాలు రాబోతున్నాయో తెలియదు గాని వాటి సంఖ్య చాలా ఎక్కువే ఉంటుందని చెప్పగలం. ఈ ప్రకారంగా నిర్మాణాలు జరిగితే  ఒక్క మన రాష్ట్రంలోనే 10 లక్షల పైబడి మత్స్యకారుల జీవనం దెబ్బతింటుంది. వీరితోపాటు ప్రకృతి మీద ఆధారపడి జీవించే కల్లుగీత కార్మికులూ గొర్రెల కాపరులూ చిన్న రైతులూ, అసైన్డ్ భూములు కలిగిన దళితులూ, భూమిలేని రైతుకూలీలూ పూర్తిగా జీవనోపాధి కోల్పోతారు.

ఈ కోస్టల్ కారిడార్ ఎంత భయంకరంగా ఉండబోతోందో దాని కోసం జరుపతలపెట్టిన తొలిదశ భూసేకరణ వివరాలు చూస్తే అర్థమవుతుంది. విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో 10 మండలాల్లో 110 రెవెన్యూ గ్రామాల్లో 603 చ. కిలోమీటర్లలో లక్షా యాభైవేల ఎకరాల భూసేకరణ జరగనుంది. అక్కడ నివసించే వాళ్ళ బతుకులేం కావాలి? కొందరి సౌకర్యవంతమైన జీవనసరళి కోసం వారందరూ తమ జీవనాధారాలను వదులుకోవలసిందేనా? ప్రత్యామ్నాయాలు లేక కాదు. పారిశ్రామికవేత్తలకు లాభసాటి ప్రయోజనాలనిచ్చే పరిశ్రమలను మాత్రమే నెలకొల్పి అవే ఆర్థికాభివృద్ధికి అవసరమని బుకాయిస్తున్నారు. ఇవి ఎవరి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నాయి, ఎంతమంది ఆర్థిక వినాశనానికి కారణమవుతున్నాయన్న ప్రశ్న ఇప్పటికైనా వేసుకోవాలి కదా.

13-8-2010

మానవహక్కుల వేదిక
**Human Rights Forum (HRF)**

ప్రచురణకర్తలు : ఎస్. జీవన్‌కుమార్, అధ్యక్షులు - 9848986286, వి.ఎస్.కృష్ణ, ప్రధాన కార్యదర్శి - 9440411899